ప్రజాశక్తి

మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | 5 | అనంతపురం

ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, తదితరులు

సమస్యలు పరిష్కరించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండల వ్యాప్తంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప కోరారు. ఈ మేరకు ఆయన సిపిఎం మండల కమిటీతో కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి సమర్పించారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఎమ్మెల్యేకు సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మండలంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో ఉన్న గురుకుల, సంక్షేమ హాస్టల్స్ ఉన్న విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు, నోట్ పుస్తకాలు, ఇతర సదుపాయాలకు నిధులు పెంచి సకాలంలో ఇవ్వాలని కోరారు. అలాగే సంక్షేమ హాస్టళ్ల గురుకుల పాఠశాలల భవనాల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు. గిరిజన గురుకుల పాఠశాలకు పక్కా భవనాలను నిర్మించాలన్నారు. మండల కేంద్రంలో బాలికలకు ప్రత్యేక బాలికోన్నత పాఠశాల, ఎపి మోడల్ స్కూల్, ఐటిఐని ఏర్పాటు చేయాలని విన్నవించారు. బుక్కరాయసముద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, కొర్రపాడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 10 పడకలు, 24 గంటల ఆసుపత్రులుగా మార్చి తగిన సిబ్బందిని నియమించాలన్నారు. అదే విధంగా మండల కేంద్రంలో సర్వే నెంబర్ 539-2, 540-2 లో ఉన్న 71 సెంట్లు స్థలంలో డాక్టరు బిఆర్. అంబేద్కర్ కన్వెన్షన్ హాలుకు రూ. 10 కోట్లు నిధులను మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. గతంలో ఎస్సీ ఉప ప్రణాళికా నిధులతో నీలారెడ్డి పల్లిలో మంజూరైన డాక్టర్ బిఆర్. అంబేద్కర్ భవనం నిర్మాణ పనులు వెంటనే చేపట్టాన్నారు. తహశీల్దారు కార్యాలయం ముందు ఉన్న మరవవంక బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలని విన్నవించారు. మరువ వంక వద్ద ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లకు రక్షణ గోడను నిర్మించాలన్నారు. దేవరకొండ కొండమీదరాయుని ఆలయం, దేవరకొండను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. చిక్కవడియార్ చెరువులో బోటింగ్ పార్కును ఏర్పాటు చేయాలన్నారు. మండల కేంద్రంలో మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని, అన్ని గ్రామాలకు గండికోట రిజర్వాయర్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పనులను పూర్తి చేసి మంచినీటి సౌకర్యం కల్పించాలి. అనంతపురం నగర సమీపాన చెరువులో వృధాగా ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకును బుక్కరాయసముద్రం మండలానికి ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా మండలంలో వివిధ పండ్ల తోటల విస్తీర్ణం పెరుగుతున్న రీత్యా పళ్ల రసాల పరిశ్రమను ఏర్పాటు చేసి, మార్కెటింగ్ కల్పించాలని డిమాండ్ చేశారు. రెడ్డిపల్లి వద్ద ఉన్న మార్కెట్ యార్డును ఉపయోగంలోకి తేవాలన్నారు. వెంకటాపురం గ్రామంలో వెటర్నరీ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి డాక్టరును, సిబ్బందిని నియమించాలని విన్నవించారు. మండలంలో డోలమైట్, బ్లాక్ గ్రానైట్, వైట్ గ్రానైట్ ఉన్నాయనివీటి ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. అదే విధంగా గొర్రెల, మేకల పెంపకం దారులకు రుణాలు, బీమా సౌకర్యం కల్పించాలని భవన నిర్మాణ కార్మికులను, రజకక్షౌర ఇతర వృత్తిదారులకు ఆదుకోవాలని విన్నవించారు. మండలంలో మట్టి మాఫియా, ఇసుక మాఫియా కొనసాగుతోందని సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2018లో సిపిఎం ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం సర్వే నెంబర్ 790-1,790-2లో పేదలు వేసుకున్న పునాదులకు పట్టాలివ్వాలని, మండల కేంద్రంలో ఉన్న గ్రామ పంచాయితీ కార్మికులకు జగజ్జీవన్ రాం కాలనీని ఏర్పాటుకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరారు. మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ నగర్ న్యూ ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు, రోడ్లు వేయాలన్నారు. మండల కేంద్రంలో నెలకొన్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ నాయకులు ఆర్. కుల్లాయప్ప, సి నాగేంద్ర, శివారెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్య, నెట్టికంటయ్య, సంజీవరెడ్డి, బి హరికృష్ణ, వెంకట కొండ, చిన్నప్ప, నడిపక్క, వెంకటలక్ష్మి, చంటి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

తన సమస్యను అధికారులకు చెబుతున్న బాధిత రైతు

పోలీసులు అడ్డుకోవడంతో తప్పిన ప్రమాదం
తన పొలం రికార్డులు తారుమారు చేశారని ఆవేదన
పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని అధికారుల హామీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తన సమస్య పరిష్కరించడం లేదని కలత చెందిన ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం అనంతపురం కలెక్టరేట్ ఆవరణంలో చోటు చేసుకుంది. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధిత ఫిర్యాదు దారులతో కలెక్టరేట్ సోమవారం కిక్కిరిసింది. రెవెన్యూభవన్ వద్ద అర్జీ ఇవ్వడానికి శింగనమల మండలం సలకం చెరువు గ్రామానికి చెందిన రైతు ముత్యాల శివయ్య వచ్చాడు. తమ సమస్యతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశాడు. అనంతరం రెవెన్యూ భవన్ నుంచి కిందకు వచ్చిన ముత్యాల శివయ్య అక్కడున్న విలేకరులతో తన సమస్య చెప్పాడు. మాట్లాడుతూనే తన వెంట తెచ్చుకున్న నిద్ర మాత్రలు నోట్లో వేసుకున్నాడు. పక్కనే ఉన్న పోలీసులు వెంటనే రైతు చేయి పట్టుకుని లాగేశారు. రైతు నోటిలో ఉన్న మాత్రలను కూడా బయటకు తీసి పడేశారు. చెట్టునీడకు తీసుకెళ్లి కూర్చోబెట్టారు. సమాచారం తెలుసుకున్న కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, తహశీల్దార్ వాణిశ్రీ రైతు ముత్యాల శివయ్య వద్దకు వచ్చి సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తనకు చెందిన భూముల రికార్డులు తారు మారు చేశారని, జరిగిన పొరపాట్లు సరిచేయాలని రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితం కన్పించలేదని వాపోయాడు. ఒక భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడం లేదన్నారు. మరొక భూమికి సంబంధించి వెబ్‌ల్యాండ్ నుంచి తొలగించేశారని తెలిపారు. సాగు చేసుకుంటున్న భూమిని తనది కాదని దబాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చానని, తహశీల్దార్‌కు విన్నవించిన ఫలితం కన్పించలేదని అన్నారు. చివరకు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేసినా న్యాయం చేయని పరిస్థితి నెలకొందన్నారు. ఉన్న భూమి కోల్పోతే తన కుటుంబానికి చావే గతి అన్నారు. తాను బతికుండగా న్యాయం జరిగేలా లేదనితన మరణంతోనైనా ప్రభుత్వం, అధికారులు స్పందిస్తారన్న ఆశతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని చెప్పారు. తనకు అనారోగ్య సమస్యలు ఉన్నాయని, సర్జరీలు కూడా జరిగాయని తెలిపారు. అధికారులు న్యాయం చేయకపోతే చావే గతి అన్నారు. స్పందించిన అధికారులు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో పోలీసుల రైతు ముత్యాల శివయ్యను ఆసుపత్రికి తరలించారు.కలెక్టరేట్ కార్యాలయం లోపలికి వస్తున్న ఫిర్యాదు దారులను గేటు వద్ద పోలీసులు తనిఖీ చేసి పంపిస్తున్నారు. అయినా రైతు ముత్యాల శివయ్య మాత్రలు తెచ్చుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

బేవరేజెస్ గోదాములను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అద్దె గోదాముల్లో ఉన్న బేవరేజెస్ గోదాములను ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, బేవరేజెస్ హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు మన్నిల రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లాలో గోదాములు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి మద్యం నిల్వ చేసే గోదాములు అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామంలో నిర్మించారని తెలిపారు. ఆరేళ్ల క్రితం పాత గోదాములు అగ్నికి ఆహుతి కావడంతో రూ.లక్షల మద్యం కాలిపోవడం, ఆస్తి నష్టం జరిగిందన్నారు. అప్పటి నుంచి బెవరేజస్ అధికారులు అద్దె గోదాముల్లోనే మద్యాన్ని నిల్వ చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు ప్రతినెలా రూ.లక్షల భారం పడుతోందన్నారు. అధునాతన సౌకర్యాలతో నిర్మించిన గోదాములను ఇప్పటికీ ప్రారంభించకపోవడం ప్రభుత్వం, అధికారులు తమ వ్యక్తిగత ప్రయోజనాలకు ఆటంకంగా ఉంటుందని నూతన గోదాముల్లోకి మార్చడం లేనట్లు ఉందన్నారు. సోములదొడ్డి గ్రామ పంచాయతీ అశ్వర్థ నారాయణస్వామి ఆలయ సమీపంలో మద్యం గోదాముల నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించారని తెలిపారు. కడపకు చెందిన ఓ గుత్తేదారుడికి ఆనాటి ప్రభుత్వ హయాంలో పనులు అప్పగించారని, టెండరు పిలిచి పనులు ఖరారు చేశారని తెలిపారు. ప్రస్తుతం రూ.7.5 కోట్లను మాత్రమే ఖర్చు పెట్టి కొన్ని గోదాములు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా ఎకరా భూమికి సంబంధించి న్యాయస్థానంలో కేసులు దాఖలు కావడంతో సగంలోనే ఆ పనులు నిలిచిపోయాయని తెలిపారు. రూ.4.5 కోట్లు పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం పూర్తి చేసిన గోదాముల్లో మద్యం నిల్వ చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పూర్తయిన గోదాములు ప్రారంభించకపోవడంతో ప్రభుత్వంపై ప్రతి నెలా రూ. లక్షకు పైగా అద్దె భారం పడుతోంది. ఇప్పటి వరకు రూ.70 లక్షలకు పైగా అద్దె చెల్లించారని, దీనికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. స్థానికంగా హమాలీలకు కనీస సౌకర్యాలు కూలి రేట్లు పెంచాలని ప్రభుత్వానికి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం తడకలేరు సమీపంలో ఉన్న గోదాముల్లో మద్యం నిల్వ చేస్తున్నారు. కార్మికులకు అవసరమైన సౌకర్యాలు, లారీలు నిలుపుకోవడానికి అక్కడ గోదాములు అనువుగా లేదన్నారు. లారీలన్నీ రహదారిపైనే ఉంటున్నాయని తెలిపారు. ఆఫీస్ నిర్వహణకు సంబంధించి అధికారులకు భవనాలు సక్రమంగా లేవన్నారు. రెండు జిల్లాల్లో ఉన్న మద్యం దుకాణాలకు ఇక్కడి నుంచే సరకును పంపిస్తారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే విచారణ చేసి ప్రభుత్వ గోదాములోకి షిఫ్ట్ చేసి ప్రభుత్వం ఆదాయానికి గండి పడకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిలాల ఉపాధ్యక్షులు ముత్తుజా, నగర నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

ధరలను నియంత్రించాలి : ఐద్వా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అన్ని నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కోశాధికారి చంద్రిక డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మను ఐద్వా ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరగడంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నారని తెలిపారు. జీవనోపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు ఆదాయాన్ని కోల్పోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ కీలకమైన ఆకలి సమస్యను పరిష్కరించలేదన్నారు. ఆహార భద్రతకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించిందన్నారు. పౌరులు గౌరవప్రదంగా జీవించడానికి వారికి ప్రాథమిక అవసరాలు అందించడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను తక్షణమే విశ్వవ్యాప్తం చేసి బలోపేతం చేయాలని కోరారు. గ్యాస్ సిలిండర్ల సబ్సిడీని అందించాలి. పిడిఎస్‌లో బయోమెట్రిక్ విధానం వినియోగాన్ని ఆపాలన్నారు. రేషన్ కార్డుల ఆధార్ అనుసంధానం ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ అశ్విని పాల్గొన్నారు.

సరికొత్త ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు

కియా మోటార్స్ అసిస్టెంట్ మేనేజర్ జి.అశోక్

ప్రజాశక్తి-అనంతపురం

మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు చేసే సరికొత్త ఆలోచనలే నూతన ఆవిష్కరణలుగా రూపాంతరం చెందుతాయని కియా మోటార్స్ అసిస్టెంట్ మేనేజర్ జి.అశోక్ అన్నారు. సోమవారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా కెరీర్‌లో అవకాశాలు.. మెకానికల్ ఇంజినీరింగ్ విశిష్టతపై అశోక్ విపులంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థులు తమకున్న నూతన ఆలోచనలను మిగతా వారితో పంచుకుని నూతన పరిశోధనలు చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి కె.కళ్యాణిరాధ, సీనియర్ ఆచార్యులు కె.హేమచంద్రారెడ్డి, డి.శ్రీనివాసన్, బి.ఓంప్రకాశ్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కియా మోటార్స్ అసిస్టెంట్ మేనేజర్ జి.అశోక్‌ను సన్మానిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-గుంతకల్లు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెంచిన భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ షామీర్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై అధిక భారాలు పడతాయన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ ఛార్జీలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరవడం మంచిది కాదన్నారు. రిజిస్ట్రేషన్ ధరలు పెరగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపార కుప్పకూలే పరిస్థితి నెలకొందన్నారు. మధ్యతరగతి ప్రజలు చిన్న ప్లాట్ కొనుగోలు చేయాలంటే రిజిస్ట్రేషన్ ధరలు భయపడాల్సి ఉందన్నారు. కావున పేద ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెంచిన రిజిస్ట్రేషన్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. అదేవిధంగా పట్టణంలో ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేరే చోటుకు మార్చాలని ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రామానాయక్, షబ్బీర్, అబ్దుల్లా, షాషా, సూరి, రాము, మగ్బూల్, నాగరాజు, బాలునాయక్, వెంకటేష్, రాజు, బుజ్జి, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పారదర్శకంగా పని చేస్తున్నాం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పారదర్శకంగా పని చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాల వల్లే ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోయాయన్నారు. ముఖ్యంగా దళిత భూములను ఆక్రమించుకోవడం, శ్మశాన వాటికల స్థలాలు, వంకలు, రహదారులను కబ్జా చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల మధ్యలోనే ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు నేరుగా మండల స్థాయి అధికారులతో కలిసి పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులతో ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డిఒ వసంతబాబు సూచించారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు, వన్ బి, అడంగల్ మార్పులు, చేర్పులు, ఆన్‌లైన్ నమోదు, తదితర సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వెంటనే ప్రజలకు న్యాయం చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఇప్పటికే వేసవికాలం తలపిస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం పలు గ్రామాల రైతులు డిడీలు చెల్లించిన విద్యుత్ కనెక్షన్లు ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో అందలేదని వినతులు అందజేశారు. వాటిపై పరిశీలించి వెంటనే రైతులకు కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. దీంతోపాటు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వారి సమస్యలపై ముఖాముఖి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీరాములు, ట్రాన్స్‌కో అధికారులు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ చేయాలని వినతి

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఫస్ట్ సర్కిల్ పరిధిలోని సచివాలయం శానిటరీ ఇన్స్‌పెక్టర్ తమను బదిలీ చేయాలని హెల్త్ ఆఫీసర్ విశ్వమూర్తిని సోమవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫస్ట్ సర్కిల్ పరిధిలో గ్యాంగ్ వర్క్ పనులు చేయాలని చెబితే కులాల పేరుతో తమను బెదిరిస్తున్నారని వ్యక్తులను టార్గెట్ చేసి టార్చర్ చేస్తున్నారని వాపోయారు. ఒత్తిళ్ల నుంచి తప్పించడానికి తమను బదిలీ చేయించాలని కోరారు. లేకపోతే కమిషనర్ ఛాంబర్ వద్ద బైఠాయిస్తామని చెప్పారు. ఈ విషయంపై కమిషనర్ స్పందించాలని వారు కోరారు.

అధికారులకు సమస్యను వివరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట

అధికారికి సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-గుంతకల్లు

రెండు రోజుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెబాట పడతామని సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి కె.ఈశ్వరప్ప, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో సిఐటియు, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌సలామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా కార్మికులకు ఇవ్వాల్సిన అరియర్స్ ఇవ్వాలన్నారు. 60 ఏళ్ల పూర్తయిన వెట్ సోర్సింగ్ కార్మికులు, పదవీ విరమణ చేసిన, మృతిచెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, ఇపిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, కార్మికులందరికీ సకాలంలో పనిముట్లు, ఏకరూప దుస్తులు, చీరలు, పాదరక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఈనెల 22వతేదీ తర్వాత సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జగదీష్, జె.నరసయ్య, తిరుపాల్, చిన్నయ్య, రమేష్, ప్రేమ్‌కుమార్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పామిడి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని భావరపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి లీనా వసుంధర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్, మసినిరెడ్డి, కాయల మహేష్, మజ్జిగ రాజశేఖర్, బొమ్మ మోహన్, కరూరు శివశంకర్, స్వామినాథరెడ్డి, రామాంజనేయులు, పవన్‌కళ్యాణ్, నక్కా హరి, నక్కా రాజు, నాగేష్, రఘునాథరెడ్డి, బాషా, బాబా ఫక్రుద్దీన్, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర, నాయకులు

గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండల వ్యాప్తంగా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పనులు పెట్టాలన్నారు. ముఖ్యంగా ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించడంతోపాటు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. మండల కేంద్రం సమీపంలో మరువకొమ్మ వద్ద బస్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాల్లో రైతులకు రూ.2వేలు బోనస్ ఇవ్వాలన్నారు. కందుల కొనుగోలు కేంద్రం వద్ద టెంటు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, కుళ్లాయిస్వామి, అంజి, జయరాముడు, రామాంజనేయులు, బాలరాజు, పి.శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో చిన్నారుల భద్రత ముఖ్యం

ప్రజాశక్తి-అనంతపురం

ఉద్యోగాలు నిర్వహించే ప్రదేశాల్లో పిల్లల భద్రత చాలా ముఖ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 'ఉద్యోగాలు నిర్వహించే ప్రదేశాల్లో పిల్లల భద్రత' అనే అంశంపై అనంతపురం అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ సంచాలకులు జివి సుబ్బారెడ్డి నేతృత్వంలో సోమవారం ఒటిపిఆర్ఐలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఆ ఇబ్బందులను ఎలా అధిగమించాలి.. ఎదుర్కోవడానికి ఎలాంటి చట్టాలు, అత్యవసర సమయాల్లో వారి భద్రతను పెంపొందించేందుకు అవసరమైన మొబైల్ యాప్‌లు, దిశాచట్టం, వన్‌స్టాప్ సెంటర్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు మహిళా సాధికార సంచాలకులు వివి.చిత్ర, జిల్లా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు వనజాఅక్కమ్మ, న్యాయ సలహాదారులు ఎ.నర్మద, కళాశాల ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.లహరి, బోధనా సిబ్బంది ఎల్.ప్రణతి, ఎస్.యామిని, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

రుద్రంపేట పంచాయతీలోని విశ్వశాంతి నగర్‌లో రూ.20 లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరునెలల్లో నాలుగు పంచాయతీల్లో రూ.6కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదన్నారు. ఇదే రుద్రంపేట-తగరకుంట మార్గంలో గతంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇక్కడ రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే రుద్రంపేట పంచాయతీని ప్రగతి వైపు నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్

ప్రజాశక్తి-గుత్తి

సిఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ డిమాండ్ చేశారు. పేదలకు రెండు సెంట్లు స్థలాన్ని ఇచ్చి పక్కా గృహాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముందుగా ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి ప్రదర్శనగా కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు సూర్యనారాయణ రెడ్డి, పద్మావతి,రమేష్, జి.రామదాసు, రాజుయాదవ్, షేక్ నజీర్, మహమ్మద్, బాషా, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-శింగనమల

విజయవాడలోని మన కళ్యాణ వేదికలో నిర్వహించి రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో మండలం కేంద్రంలోని ఎఎన్ఆర్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఇందులో భాగంగా అబాకస్ సీనియర్ విజువలైజేషన్ విభాగంలో 5వ తరగతి విద్యార్థి బి.రవివరుణ్ యాదవ్ కన్సలేషన్ ప్రైజ్, స్టార్ జూనియర్స్ విభాగంలో 2వ తరగతి విద్యార్థిని బి.భాగ్యోదయ స్టార్ ఛాంపియన్‌షిప్ ప్రైజ్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వై.ఆంజనేయరెడ్డి తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఎఎన్ఆర్ స్కూల్ యాజమాన్యం, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

రాజకీయ పబ్బం కోసమే 'తోపుదుర్తి' ఆరోపణలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాజకీయంగా తన పబ్బం గడుపుకోవడానికే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరిటాల కుటుంబపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వైసిపి నాయకుల మధ్య విభేదాలు వచ్చి గొడవలు చేసుకుంటే పరిటాల కుటుంబంపై నిందలు వేయాలని చూడటం బాధాకరమన్నారు. ఎక్కువ శాతం మీరు అధికారంలో ఉన్నప్పుడే నియోజకవర్గంలో కురుబలు, వాల్మీకులపై దాడులు చేసి పోలీసులను అడ్డు పెట్టుకుని తప్పుడు కేసులు బనాయించారని గుర్తు చేశారు. ఇపుడు అధికారం కోల్పోయాక అదే పోలీసులను వాచ్‌మెన్‌గా పోల్చడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసుల మనోభాలు దెబ్బతినేలా మాట్లాడిన ప్రకాష్‌రెడ్డిపై సుమోటాగా కేసు తీసుకుని జిల్లా బహిష్కరణ చేయాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన

గుత్తి : మండలంలోని తొండపాడు ఉన్నత పాఠశాలలో సోమవారం రోడ్డు నిబంధనలపై హెచ్ఎం శ్రీవాత్సవరెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఆర్టీసీ అధికారులు ప్రసాద్, గోపాల్ రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ గౌడ్, శ్రీనివాసరావు, భారతీ, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

In The Court of The Prl. District Judge, Ananthapuramu
Crl.A . No:61/2024
Between:
C.Lingama Naidu ...Appellant/Accused
And
M.Surya Prakash and another ...Respondants/Complainant
Notice To Respondent No:1
R1: M.Surya Prakash S/o Veera Narappa, R/of Bondalawada Village, Narpala Mandal, Ananthapuramu Dist.
పై నెంబరు కేసులో రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం 14/02/2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
A.SURESH KUMAR Advocate, Ananthapuramu, Cell:9440204098

వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మణిరవిని సోమవారం అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లావాసి అయిన మణిరవికి రాష్ట్ర వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక వర్గం తరపున బలమైన వాయిస్ వినిపించడంలో మణి రవి ముందుంటారన్నారు.

నిత్యావసర ధరలను నియంత్రించాలి

ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి

వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

ప్రజాశక్తి-గుంతకల్లు

పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించి చౌకధాన్య డిపోల్లో అన్నిరకాల సరుకులు అందించాలని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా కమిటీ సభ్యురాలు రమాబాయి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవి, సిఎస్‌డిటి సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరల పెరిగిపోతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున ధరలను నియంత్రించడంతోపాటు ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తృతం చేయాలని కోరారు. ముఖ్యంగా చౌక డిపోల్లో ఆహార ధాన్యాలు, పప్పులు, వంటనూనె, చక్కెర మొదలైన వాటితో సహా 14 రకాల నిత్యవసర వస్తువులు సబ్సిడీ ధరలకు అందజేయాలని కోరారు. అదేవిధంగా కిరోసిన్ లీటర్ రూ.15తో సరఫరా చేయాలని, ఎల్‌పిజి సిలిండర్లను సబ్సిడీతో అందించాలని, పిడిఎస్‌లో బయోమెట్రిక్ సిస్టం వాడకాన్ని ఆపాలని, రేషన్ కార్డుల ఆధార్ అనుసంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కెఎం షాకీరా, సరస్వతి, లక్ష్మి, మహాలక్ష్మి, రూతమ్మ, లక్ష్మీనరసమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలి

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు కాంట్రాక్టర్ల వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

15 ఫైనాన్స్ కింద విడుదలైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని పలువురు కాంట్రాక్టర్లు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ కింద గ్రాండ్ టెండర్లలో పాల్గొని పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు త్వరితగతిన పూర్తి చేశారన్నారు. అయితే ఇందుకు సంబంధించి సిఎఫ్ఎంఎస్‌లో సైతం పూర్తయిన పనులకు రూ.2.30 కోట్ల బిల్లులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను సాకుగా చూపి పూర్తయిన పనుల బిల్లులు చెల్లించకుండా వాటిని అప్పటి కమిషనర్ నాగరాజు అప్పటి అకౌంట్స్ ఆఫీసర్ విజయ్‌కుమార్ రూ.12కోట్ల నిధులను ప్రభుత్వ ఖాతాకు జమ చేశారన్నారు. దీనివల్ల పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదన్నారు. కావున ఎమ్మెల్యే స్పందించి తక్షణమే బిల్లులు చెల్లించి కాంట్రాక్టర్లను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టర్ల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే మున్సిపల్ స్థలాల కబ్జాతోపాటు పలు అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఆగిన పనులపై దృష్టి సారించాలి

మేయర్ మహమ్మద్ వసీం

కమిషనర్‌తో మాట్లాడుతున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పూర్తిస్థాయిలో కమిషనర్లు లేకపోవడంతో నగరంలో కొద్దిరోజుల నుంచి ఆగిన పనులన్నింటినీ తిరిగి ప్రారంభించాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. సోమవారం నగరంలోని మేయర్ ఛాంబర్‌లో కమిషనర్ బాలస్వామితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతివీధిలో కుక్కలతో ఇబ్బందిగా ఉందని, వెంటనే కుక్కలకు ఆపరేషన్లు చేయాలని సూచించారు. పారిశుధ్యాన్ని మెరుగు పరచాల్సిన అవసరం ఉందన్నారు. వేసవి దగ్గర పడుతుండటంతో ముందస్తు ప్రణాళికలతో ఇంజనీరింగ్ సిబ్బందిని సిద్ధం చేయాలని ఆదేశించారు. గత కౌన్సిల్ సమావేశంలో 30 ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని నగరంలో చెత్తను తరలించేందుకు ఆమోదించామని ఇప్పటిదాకా ట్రాక్టర్లు ఏర్పాటు చేయలేదన్నారు. 132 మంది అదనపు కార్మికులను ఎంపిక చేయాల్సి ఉండగా ఇప్పటిదాకా ఎంపిక చేయలేదని వెంటనే ఎంపిక చేసి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలన్నారు. లైట్లు కొనుగోలు చేసిన ఇంకా చాలా ప్రాంతాల్లో లైట్లు ఏర్పాటు చేయలేదని లైట్లు ఏర్పాటు చేసి చీకట్లు తొలగించాలన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

మాట్లాడుతున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. హామీల అమలుకు రానున్న రోజుల్లో పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. ఇకపోతే వైసిపి బలోపేతం చేసేందుకు అధినేత జగన్ చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగానే మండల, పట్టణ కన్వీనర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులను నియమించినట్లు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల, పట్టణ కన్వీనర్లను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ, మండల కన్వీనర్లు శ్రీనివాసులు, రామాంజనేయులు, లక్ష్మీకాంతరెడ్డి, రవీంద్రారెడ్డి, రామాంజనేయులు, బ్రహ్మానందరెడ్డి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, నాయకులు ఉషారాణి, నాగిరెడ్డి, రామాంజనేయులు, శివప్ప, నాగప్ప, మారన్న తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

నిర్మూలన దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

పిల్లల్లో నులి పురుగులను నివారించి రక్తహీనత నుంచి కాపాడుకుందామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని శారద మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయిస్తోందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న మాట్లాడుతూ జిల్లాలోని 1 నుంచి 19ఏళ్లలోపు పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇబి.దేవి, డిఇఒ ప్రసాద్‌బాబు, కమిషనర్ బాలస్వామి, హెడ్మాస్టర్ బి.రమాదేవి, ఐసిడిఎస్ పీడీ వనజ అక్కమ్మ, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, కార్యక్రమం నిర్వహణ అధికారి జి.నారాయణస్వామి, ఎంఇఒ వెంకటస్వామి, డిఇఐసి మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : వ్యక్తిగత, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ సూచించారు. సోమవారం మండలంలోని తొండపాడు గ్రామంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బేతాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ దేవేంద్ర, డాక్టర్ అమర్నాథ్, హెల్త్ సూపర్‌వైజర్ లాజరస్, ఎఎన్ఎం లక్ష్మీకాంత పాల్గొన్నారు.

శింగనమల : పిల్లల్లో నులి పురుగులను నివారించి రక్తహీనత నుంచి కాపాడుకుందామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శంకర్‌నాయక్ సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలనలో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య, అంగన్వాడీ, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలతోపాటు సెంట్రల్ యూనివర్సిటీ, రెడ్డిపల్లి పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ తెహర్నిశా, కెజిబివి ప్రిన్సిపాల్ నాగవేణి, సిహెచ్ మోహన్‌రావు, పిహెచ్ఎం చెన్నమ్మ, నాగలక్ష్మమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఫాతిమా, సూపర్‌వైజర్ సత్యనారాయణ శాస్త్రి, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ జయంతి, శ్రీజ, మహిళా ఆరోగ్య కార్యకర్తలు అంజనమ్మ, ఆదినారాయణమ్మ, నందిని, నాగలక్ష్మి, వరలక్ష్మి, కెజిబివి ఎఎన్ఎం లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని దుర్గం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతోపాటు అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాకే రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు నాగార్జునరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి, అంగన్వాడీ టీచర్ బాలమ్మ, పెద్దక్క, ఆశా, వీరనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : వైద్యాధికారి శివకృష్ణ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మల్లికార్జున, హెచ్ఎం సాంబశివుడు, ఐఇఆర్‌డి ఆనంద్, ఎఎన్ఎం లీలావతి, ఆశాలు గాయత్రి, చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్లలో 1 నుంచి 19ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో చాబాల సర్పంచు మల్లెల జగదీష్, రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, ప్రధానోపాధ్యాయురాలు షకీలా, సైన్స్ టీచర్ గంగాభవాని, పీడీ చంద్రశేఖర్, సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, ఎంపిహెచ్ఎస్ స్వర్ణలత, ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మి, ఇందిరమ్మ, ఆశా, పావని, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని కస్తూరిబా గాంధీ, ఆదర్శ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శ్రీవాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈకార్యక్రమంలో సిహెచ్, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : నులి పురుగు నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని కస్తూరిబా గాంధీ, ఆదర్శ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య వైద్యుడు లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈకార్యక్రమంలో సిహెచ్ఒ మధుకుమార్, సూపర్‌వైజర్ హాజీవలి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల రాష్ట్ర అవార్డు ప్రదానోత్సవం

అనంతపురం కలెక్టరేట్ : పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఘంటసాల రాష్ట్ర అవార్డుల ప్రధానోత్సవం, సంగీత విభావరి నిర్వహించనున్నట్లు పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుగుమంచి సురేష్‌బాబు, మారుతీప్రసాద్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు

యాడికి : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నిట్టూరు గ్రామంలో జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 43 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా నలుగురికి శస్త్రచికిత్స అవసరం ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ జిపిఎంఒఒ మధుసూదనరాజు, 104 డిఇఒ అనిల్, ఎంపిహెచ్ఎలు మద్దిలేటి, బి.సరస్వతి, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, నాగేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

శింగనమల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్డు ద్వారానే పంట నమోదు, పిఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, రాయితీ విత్తనం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల అమ్మకాలు.. వంటివి సులభతరం అవుతాయన్నారు. కావున రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్ నెంబర్‌తో రైతు సేవాకేంద్రాలకు వెళ్లి తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఆలయ హుండీ లెక్కింపు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 2వవారం తాత్కాలిక హుండీల ద్వారా వచ్చిన ఆదాయం రూ.614,898, శాశ్వత హుండీల ద్వారా రూ.3,96,817, శీఘ్ర దర్శనం ద్వారా రూ.173450, తలనీలాల ద్వారా రూ.17650, అభిషేకం ద్వారా రూ.వెయ్యి, విరాళాల ద్వారా రూ.15499 వచ్చినట్లు ఆలయ ఇఒ సుబ్రమణ్యం తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

యాడికి : ఎస్పీ పి.జగదీష్, తాడిపత్రి ఏఎస్పీ ఆదేశాలతో సైబర్ నేరాలపై స్థానిక జెసి దివాకర్‌రెడ్డి కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా నకిలీ లోన్ల యాప్‌లు, షేర్ మార్కెట్, కొరియర్ మోసాలు, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్, ఆర్థిక నేరాలు వంటి వాటిపై ఎస్ఐ వెంకటేష్ అవగాహన కల్పించారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అనంతపురం : నగరంలోని మిక్షర్, చిప్స్ తయారి కేంద్రాలతోపాటు కేటరింగ్ సర్వీస్ సెంటర్లు, వాటర్‌ప్లాంట్‌లో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తుండటంతో రూ.70వేలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు కె.శ్రీనివాసులు, యు.సద్గురుడు, జె.వాసుప్రకాష్, బి.సురేష్‌కుమార్, మున్సిపల్ హెల్త్ఆఫీసర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు : కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు వివిధ సామాజిక వర్గాలకు మంజూరైన సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సామాజిక వర్గాల వారు ఐదుగురు సభ్యులతో సంఘం ఏర్పాటు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

35 యూనిట్లు మంజూరు

పుట్లూరు : మండలానికి 35 యూనిట్లు మంజూరైనట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసిలకు 28, కాపులకు ఏడు యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 12వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

కళ్యాణదుర్గం : ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి రంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన మండల కన్వీనర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పని చేస్తే ప్రతి ఒక్కరికీ పార్టీ పెద్దపీట వేస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిండగడుతూ ప్రజల్లో నూతనోత్తేజం నింపాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు ఎత్తిచూపుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు.

చీనీతోటల పరిశీలన

బుక్కరాయసముద్రం : తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లి గ్రామంలో చీనీతోటలను కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా తోటల్లో పొలుసు పురుగు ఉధృతి, గ్రీనింగ్ తెగులు ఉన్నట్లు గుర్తించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్ర వేత్త డాక్టర్ కిషోర్, తాడిమర్రి టిడిపి మండల కన్వీనర్ రామ్మోహన్, రైతులు పురుషోత్తం, ఆదెప్ప, నాగభూషణం, కెవికె సిబ్బంది ముత్యాలరావు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

యాడికి : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తాడిపత్రి మలేరియా నివారణ సభ్యులు శ్రీనివాసులు సూచించారు. సోమవారం చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ల్యాబ్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా రక్తపరీక్షలు చేయాలన్నారు. అదేవిధంగా నిట్టూరు గ్రామంలో 104సేవలను పరిశీలించారు. తర్వాత ఎఎన్ఎం రికార్డులను పరిశీలించి ఎంఎఫ్ టు డైరీ రికార్డును పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సరస్వతి, హెల్త్ అసిస్టెంట్ మేల్ మద్దిలేటి, ఆశా కార్యకర్తలు రాజీ, నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

'మన ఆస్తిని మనమే కాపాడుకుందాం'

ఉరవకొండ : 'మన ఆస్తిని మనమే కాపాడుకుందాం.. మన ఆస్తికి కంచె ఏర్పాటు చేసుకుందాం' అని పట్టణంలోని గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. సోమవారం ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో హాస్టల్ సాధనకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం పట్టణ సిఐ మహానంది, తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ బోగన్నగౌడ్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు ఆనందరాజు, మీనుగ గోపాల్, ముష్టూరు ఎర్రిస్వామి, మీనుగ రామాంజనేయులు, కొనకొండ్ల చిన్న అంజనేయులు, తొండం చంద్రశేఖర్, మోపిడి వన్నూరుస్వామి, సింగాడి వీరప్ప, ఆమిద్యాల నారాయణస్వామి, లత్తవరం చంద్రశేఖర్, ఉరవకొండ అంజి, పెద్దన్న, చిన్నష్టూరు ఆంజనేయులు, రాగులపాడు రామాంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులో శివస్వాముల గ్రామోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివమాల ధరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని పురవీధుల గుండా శివుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు పరవశంతో శివుడి భక్తిపాటలు పాడుతూ కోలాటం చేపట్టారు.

కేబుల్ వైరు చోరీ

శింగనమల : మండల కేంద్రంలోని మాలకొండ వద్ద ఉన్న పంచాయతీ మోటార్‌కు చెందిన విద్యుత్ కేబుల్ వైరను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దాదాపు 150 మీటర్ల విద్యుత్ కేబుల్ వైరును ఎత్తుకెళ్లారు. మండలవ్యాప్తంగా వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్ వైర్లు చోరీకి గురవుతుండటంతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కేబుల్ వైర్ల చోరీకి పాల్పడుతున్న నిందితులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.